
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజకీయం కోసమే జగన్ పర్యటన

● మామిడి రైతుల పేరుతో దొంగ పరామర్శ

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ లబ్ధి కోసమే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో తోతాపురి మామిడి రైతుల పరామర్శ పెట్టారని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మామిడి రైతులకు కనీసం కిలోకు రూ.12 వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రైతుల విషయమే కాకుండా పల్ప్ పరిశ్రమల యాజమాన్యాల ఇబ్బందులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని మ్యాంగోపల్ప్‌పై ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసినట్లు వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంటే జగన్ రాజకీయాలు చేస్తున్నాడని, రైతుల పేరుతో ప్రభుత్వంపై రాళ్లేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. చిత్తూరు జిల్లాలో రైతులను పరామర్శించడానికే వెళుతున్న జగన్ బలప్రదర్శన తరహాలో వెళ్లడం ఎందుకు? జనసమీకరణ టార్గెట్లు, వాహనాల మోహరింపు ఎందుకో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. తోతాపురి మామిడితో సంబంధం లేని కడప జిల్లా నుంచి కార్యకర్తలను ఎందుకు తరలిస్తున్నారని అడిగారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప జిల్లాల నుంచి 25 వేల మంది కార్యకర్తలను తరలించాల్సిన అవసరం ఉందా? దీనికోసం 90 బస్సులు, 1810 కార్లు, వ్యాన్లు, 2230 బైకులతో దండయాత్ర చేస్తారా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులను పట్టించుకోని జగన్ అధికారం పోయాక తన రాజకీయం కోసం రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాడని విమర్శించారు.

అన్నదాత ఆవేదన

● ఆన్‌లైన్‌లో భూ వివరాలు మాయం

● రుణాలు కట్టాలని బ్యాంకు అధికారుల ఒత్తిడి

● గత ప్రభుత్వ నిర్వాకంతో రైతుల ఆందోళన





రీసర్వేలో ఆన్‌లైన్ నుంచి తొలగించిన పొలంలో రైతు సాగు చేసిన పైరు

బి.కోడూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో రైతులను తీవ్ర ఇబ్బందులపాలు చేసింది. తరాల నుంచి సాగు చేసుకుంటున్న భూముల రికార్డులను తారుమారు చేస్తూ ఆన్‌లైన్ నుంచి తొలగించింది. బి.కోడూరు మండల పరిధిలోని ప్రభలవీడు పంచాయతీ తిప్పరాజుపల్లె గ్రామ రెవెన్యూపొలంలో దాదాపు 600ఎకరాలు, పెదుళ్లపల్లె పంచాయతీలో 150 ఎకరాలు, పాయలకుంట్ల పంచాయతీలో దాదాపు 400 ఎకరాల భూములను గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో ఆన్‌లైన్ నుంచి తొలగించి ఇబ్బందులపాలు చేశారు. ఈ భూములను తనఖా పెట్టి రుణాలు తీసుకున్న బ్యాంకుల్లో.. ఇప్పుడు రుణాలు రెన్యువల్ కావడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటికి మూడు దఫాలుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బద్వేలు ఇన్‌చార్జి రితీశ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఏకరువు పెట్టారు. అలాగే ఇన్‌చార్జి మంత్రికీ విన్నవించారు. కానీ ఇంతవరకు ఆ రైతుల సమస్యకు పరిష్కారం దొరకలేదు. కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం ప్రవేశపెట్టి రైతుల ఖాతాలో డబ్బులు వేస్తామంటోంది. ఆ డబ్బులు భూములు ఆన్‌లైన్‌లో ఉంటేనే పడతాయని లేదంటే రావని రైతులు ఆందోళన పడుతున్నారు.

రుణాలు కట్టాలంటూ ఒత్తిడి

రైతులు తమ భూములను వివిధ బ్యాంకులలో తనఖా పెట్టి రుణాలు పొందారు. వీటిని ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నారు. అయితే జగన్ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించడంతో ఈ రైతులు బ్యాంకు వద్దకు వెళ్లలేదు. ఒకవేళ బ్యాంకు వద్దకు వెళ్లి రుణాన్ని రెన్యువల్ చేయమంటే ఆన్‌లైన్ 1బీ తీసుకురమ్మని బ్యాంకర్లు కోరుతున్నారు. ఆన్‌లైన్‌లో భూముల వివరాలు లేకపోవడంతో రెవెన్యూ వాళ్లు 1బీ ఇవ్వరు. ఈ నేపథ్యంలో రైతులు బ్యాంకులకు వెళ్లడం లేదు. అయితే బ్యాంకు అధికారులు రైతుల ఇళ్ల వద్దకు వచ్చి మీరు తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోండి.. లేదంటే తీసుకున్న అప్పును చెల్లించండి అంటూ ఒత్తిడి చేస్తున్నారు. దీంతో రైతులకు దిక్కుతోచడం లేదు. తరాల నుంచి సాగు చేసుకుంటూ వస్తున్న భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించి తమను ఇబ్బందులపాలు చేశారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయమై బి.కోడూరుతహశీల్దార్ దస్తగిరిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. గత ప్రభుత్వంలో రీసర్వేలో ఆన్‌లైన్ నుంచి తొలగించిన భూముల వివరాలన్నీ ఉన్నతాధికారులకు పంపించామన్నారు. త్వరలో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.

ఆన్‌లైన్‌లో ఎక్కించండి



ఎప్పటినుంచో సాగు చేసుకుంటూ వచ్చిన ఫలితంతో జీవిస్తున్నాం. పోయిన ప్రభుత్వంలో రీసర్వే నిర్వహించి భూములన్నీ ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఇప్పుడు అన్నదాత సుఖీభవ డబ్బులు మాకు రావాలంటే ఆన్‌లైన్‌లో మా భూములు నమోదై ఉండాలి. అధికారులు దయ ఉంచి మా భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలి.

- దుగ్గినేని సుబ్బరామయ్య, రైతు, తిప్పరాజుపల్లె

సెలవులో డీపీవో

కడప రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి) : పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) రాజ్యలక్ష్మి సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు మెడికల్ లీవ్‌పై వెళ్లారు. ఈ మేరకు కలెక్టర్ డీపీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలను జడ్పీ సీఈవో సి.ఓబులమ్మకు అప్పగించారు. అయితే జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ కూడా అనారోగ్య సమస్యలతో జూన్ 28 నుంచి ఆదివారం వరకు శెలవులోనే ఉన్నారు. ఆమె ఆరోగ్యం కుదట పడకపోవడంతో మరో 10 రోజుల పాటు లీవును పొడిగించారని సమాచారం. దీంతో జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం ఇన్‌చార్జ్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు.

రైల్వేస్టేషన్ తనిఖీ



గేటు వేసే విధానాన్ని పరిశీలిస్తున్న డీఆర్ఎం

ముద్దనూరు / కొండాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ముద్దనూరు రైల్వేస్టేషన్‌ను సోమవారం గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా పరిశీలించారు. అందులో భాగంగా రైల్వేస్టేషన్ సమీపం నుంచి జమ్మలమడుగు రోడ్డులోని రైల్వేగేట్ల వరకు ఉన్న రైల్వే స్థలం హద్దులను పరిశీలించారు. రైలు పట్టాల పాయింట్‌లను, రైల్వేగేట్ల వద్ద గేటు వేసే విధానం, అత్యవర గేటు పనిచేసే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే.. కొండాపురం సమీపంలోని చిత్రావతి నదిపై నిర్మించిన రైల్వేబ్రిడ్జిని సోమవారం సాయంత్రం డీఆర్ఎం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే ఆయన వచ్చారని రైల్వే అధికారులు తెలిపారు.

పులివెందులకు వచ్చిన మాజీ సీఎం జగన్



హెలికాప్టర్ ద్వారా పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్

పులివెందుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులకు వచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం జగన్ బెంగళూరు నుంచి హెలిక్యాప్టర్ ద్వారా పులివెందులకు చేరుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన పులివెందుల పర్యటనకు వచ్చారు. సోమవారం రాత్రి పులివెందులలోని ఆయన ఇంట్లో బస చేశారు. మంగళవారం ఉదయం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుంటారు. 8.15గంటల వరకు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి బెంగళూరుకు వెళ్లనున్నారు.

పొగాకు రైతుల ఆందోళన



గోడౌన్ ముందు పంటలోడు ట్రాక్టర్లు నిలిపి ఆందోళన చేస్తున్న రైతులు

ముద్దనూరు జూలై 7 (ఆంధ్రజ్యోతి): మీరే నారిచ్చారు, మీరే కొంటామన్నారు.. ఇప్పుడు కొనేదిలేదు అంటే ఎలా.. మీరు కొనాల్సిందే అంటూ పొగాకు ట్రాక్టర్లతో రైతులు సోమవారం ముద్దనూరులోని యశ్వంత్ గోడౌన్ వద్ద ఆందోళన చేపట్టారు. రైతుల సమాచారం మేరకు.. పెద్దముడియం మండల కొండసుంకేసుల గ్రామంలో జీపీఐ కంపెనీకి చెందిన వారు పొగాకు పంటను ప్రోత్సహిస్తూ నారు అందజేశారన్నారు. 90 రోజుల్లో పంట వస్తుందని, క్వింటా రూ.18,500తో కొనుగోలు చేస్తామని నమ్మబలికారన్నారు. పంట చేతికి వచ్చి రెండు నెలలు దాటిందన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేయలేదన్నారు.ఇప్పటికే కొంతమంది రైతుల పంట వర్షంలో తడిసిపోయి నష్టపోయారన్నారు. దీంతో ముద్దనూరులో జీపీఐ కంపెనీ వారు ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రమైన యశ్వంత్ గోడౌన్‌కు ట్రాక్టర్లతో పంటను తీసుకొచ్చామన్నారు. దాదాపు 10 ట్రాక్టర్లలో 400 క్వింటాళ్ల పంటను తీసుకొస్తే అక్కడి సిబ్బంది తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఉదయం నుంచి గేటు వద్దనే ఉన్నామన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గేటు తాళాలు పగలగొట్టామన్నారు. దీంతో పోలీసులు యశ్వంత్ గోడౌన్ వద్దకు చేరుకుని రైతులతో, కంపెనీ వారితో మాట్లాడారు. నాలుగు రోజుల్లో పొగాకు కొనుగోలు చేస్తామని, పంట గోడౌన్ ప్రాంతంలోనే ఉంచాలని తెలపడంతో రైతులు శాంతించారు. అయితే వర్షం వచ్చి పొగాకు దెబ్బతింటే కంపెనీ వారే బాధ్యత వహించాలని రైతులు పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న దంపతుల అరెస్టు
● 2.8 కేజీల గంజాయి, బైకు స్వాధీనం
7
విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి

14 ఎర్రచందనం దుంగలు పట్టివేత
● ముగ్గురి అరెస్ట్ .. ఒకరు పరార్
6

బాలిక అదృశ్యం.. వేంపల్లెలో ఉద్రిక్తత

● పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన బంధువులు

● పోలీస్‌స్టేషన్ కిటికీ అద్దాలు బద్దలు

● నాలుగుగంటల పాటు ఆందోళన

● బాలిక ఆచూకీ దొరకడంతో సుఖాంతం



7

వేంపల్లె పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం చేయాలంటూ నినాదాలుచేస్తున్న బాలిక బంధువులు

పేదరికం లేని సమాజమే లక్ష్యం

● అట్టడుగు వర్గాలను ఆదుకుందాం ● పీ-4 ద్వారా మరింత ఆర్థిక అభివృద్ధి

● జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో ఇన్‌చార్జి మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రభుత్వ విప్‌లు ఆదినారాయణరెడ్డి, మాధవి, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే లక్ష్యమని దీనికోసం చేపట్టిన పీ-4లో సంపన్నులు, ఎన్నారైలు భాగస్వాములు కావాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌పై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2047 నాటికి రాష్ట్రం స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మారాలనీ కోరుకున్న విజనరీ నాయకుడన్నారు. పేదరికం పూర్తిగా రూపు మాపాలని, అందరితో సమానంగా అన్నిరంగాల్లో పేదలు కొనసాగాలని కోరుకున్న ఏకైక సీఎం చంద్రబాబు నాయుడన్నారు. పీ-4 అమలు కోసం ముఖ్యమంత్రి ఆరునెలలుగా క్షేత్ర స్థాయిలో విస్తృత సర్వేతో సమాచారం సేకరించి అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. పేదరికం లేని సమాజం నిర్మించేందుకు ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారు తమ దాతృత్వాన్ని చాటాలన్నారు. గ్రామంలో పుట్టి అక్కడే చదివి, విదేశాల్లో స్థిరపడిన ఎన్నారైలు, ఉన్నత స్థానాల్లో, వ్యాపార, పరిశ్రమ రంగాల్లో ఉన్న వారు సొసైటీకి తమవంతు సాయం అందిస్తే పేదరికంలేని సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. జిల్లాలో 76 వేల కుటుంబాలు పేదరికంలో ఉన్నట్లు పీ-4 సర్వేలో తేలిందన్నారు. పేదలుగా గుర్తించిన వీరందరిని బంగారు కుటుంబాలుగా, పేదరికం దిగువనున్న వీరందరకీ సాయం అందించేందుకు ముందుకొచ్చే వారిని మార్గదర్శులుగా పరిగణిస్తున్నామని అన్నారు. ఇప్పటికే పీ-4 పథకంలో భాగస్వా ములు అయ్యేందుకు ఎంతోమంది ఎన్నారైలు సంపన్న వర్గాలు ముందుకొస్తుం డడం శుభ పరిణామ మన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యం చేరుకోవడానికి రానున్న ఐదేళ్లలో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధిపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఏడాది 15శాతం వృద్ధి రేటును పెంచుకుంటూ పోతే 2047 స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యాన్ని వందశాతం సునాయాసంగా చేరుకోవచ్చన్నారు. సమాజంలో పేదరికం నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలు చేస్తోందన్నారు. దీనిని సామాజిక బాధ్యతగా తీసుకుంటే పేదరికంలేని సమాజాన్ని నెలకొల్ప వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు ఆదినారాయణ రెడ్డి, ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, జేసీఅదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిష్కారం అందించండి

● జేసీ అదితిసింగ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని జేసీ అదితిసింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీతో పాటు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా.. గోపవరం మండలానికి చెందిన రమాదేవి తమకు సెంటు స్థలం లేదని ఆన్‌లైన్‌లో భూమి ఉన్నట్లుగా చూపించడంతో ఇద్దరు కూతుర్లకు తల్లికి వందనం జమ కాలేదని ఫిర్యాదు చేశారు. వీఎన్‌పల్లె మండలం ఉరుటూరు గ్రామానికి చెందిన గోపాల్ తమ కూతురికి గురుకుల పాఠశాల హాస్టలు చేర్పించేందుకు అనుమతి కోరుతూ దరఖాస్తు సమర్పించారు. తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాశినాయన మండలం రెడ్డికొట్టాల గ్రామానికి చెందిన సుబ్బలక్షుమ్మ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ వెంకటపతి, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి



ప్రజల సమస్యలపై ముఖాముఖి మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోను చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో పేరెంట్స్, టీచర్స్ మీట్ జరగాలి



కడప కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈనెల 10 తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు పక్కా ప్రణాళికతో నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్ హాల్లో మెగా పేరెంట్స్-టీచర్ మీట్ సంసిద్ధత ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి కలెక్టర్ ఎంఈవోలు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి పాఠశాల, కళాశాల నుంచి రెండు నిమిషాల వీడియో, 2 ఫొటోలు అప్లోడ్ చేసే విధంగా మంగళ, బుధవారాల్లో ట్రైల్ రన్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, డీఈవో షంషుద్దీన్, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, కడప కమిషనర్ మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చూడండి

● యూసీఐఎల్ అధికారులతో కలెక్టర్

పులివెందుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్ వల్ల రైతులు నష్టపోకుండా, టెయిలింగ్ పాండ్‌వల్ల వచ్చే సమస్య జఠిలంకాకుండా పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి యూసీఐఎల్ అధికారులకు వివరించారు. సోమవారం కలెక్టరేట్‌లో యూసీఐఎల్ అధికారులతో, పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, రెవెన్యూ అధికారులు, యూసీఐఎల్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... సోమవారం ఆంధ్రజ్యోతిలో 'విషం చిమ్ముతున్న టెయిలింగ్ పాండ్' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై కలెక్టర్ స్పందించి భూగర్భ జలాలు కలుషితం అయ్యి పంటలు పండని రైతులకు న్యాయం చేయాలని అన్నారు. వీలైనంత త్వరగా యూసీఐఎల్ పరిసర గ్రామాల రైతుల సమస్యలు తీర్చాలని కలెక్టర్ వారితో పేర్కొన్నారు. యూసీఐఎల్ అధికారులు స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని వివరించినట్లు తెలిసింది.

ఇడుపులపాయకు చేరుకున్న వైఎస్ షర్మిల

వేంపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం సాయంత్రం ఇడుపులపాయకు చేరుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద మంగళవారం ఉదయం షర్మిల, ఇతర కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించనున్నారు. కాగా.. కడప నుంచి షర్మిల ఇడుపులపాయకు వెళ్తూ మార్గమధ్యంలోని వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఇంటికి వెళ్లారు. అనారోగ్యానికి గురైన తులసిరెడ్డి సతీమణిని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం ఆమె వెంటఉన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

● మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



గండికోటలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం జమ్మలమడుగు మండలంలోని గండికోటను సందర్శించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి తదితరులతో కలసి మంత్రి ఇంటింటికి వెళ్లి 'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాలు అందజేసి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సూపర్-6 పథకాలు, తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, పింఛన్లు, తదితర వాటికి సంబంధించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని కన్నెలూరులో పర్యటించారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని భూపేశ్‌రెడ్డి స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఈశ్వర్, పుల్లారెడ్డి, కౌన్సిలర్ బాణా శివరామలింగారెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, జంబాపురం రమణారెడ్డి, పొన్నతోట శ్రీనివాసులు, మల్లికార్జున, గండికోట హరి, చేరెడ్డి చెన్నకేశవరెడ్డి, కర్నాటి రామాంజనేయరెడ్డి, బిర్రు సంతోశ్ తదితరులుపాల్గొన్నారు.

తంబళ్లపల్లె - శివపురం రోడ్డుకు మోక్షమెప్పుడో..?

● అటవీ శాఖ అనుమతులు రాక ఆగిన పనులు ● రోడ్డు పూర్తైతే జిల్లా కేంద్రానికి తగ్గనున్న దూరం

తంబళ్లపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె-శివపురం రోడ్డుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని పడమటి మండలాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కడప, రా యచోటి ప్రాంతాల నుంచి తంబళ్లపల్లె మీదుగా బెంగ ళూరుకు వెళ్లేందుకు తంబళ పల్లె-శివపురం రోడ్డు ఏర్పా టు చేయాలని 2017లో అ ప్పటి టీడీపీ ప్రభుత్వం సంక ల్పించింది. పనులు ప్రారంభించి తంబళ్లపల్లె నుంచి సుమారు 3 కిలో మీటర్లు.. పెద్ద మండ్యం మం డలం సిద్దవరం నుంచి సు మారు 2 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేశారు. మధ్య లో సుమారు 3 కిలోమీటర్లు అటవీ శాఖ పరిధిలో ఉండటం తో ఆ శాఖ నుంచి అనుమతులు రాక నిలిచిపోయింది. నాటి నుంచి నేటి దాకా ఈ రోడ్డు పనులు ఎ క్కడ వేసిన గొంగళి అక్కడేలాగా ఉండిపోయాయి. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయింది. రోడ్డు, రవాణా శాఖ మంత్రిగా రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు. మంత్రి దృష్టి సారించి రోడ్డు పనలుఉ పూర్తి చేస్తే జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్లడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని పడమటి మండలాల ప్రజలు అంటున్నారు.



శివపురం రోడ్డుకు డిమాండ్

రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రం చేయడంతో తంబళ్లపల్లె-శివపురం రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలనే డిమాండ్ పెరిగి పోయింది. ప్రస్తుతం తంబళ్లపల్లెతో పాటు, ములకలచెరువు, బి. కొత్తకోట మండలాల ప్రజ లు, అధికారులు జిల్లా కేం ద్రానికి వెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉంది. సాధారణ ప్రజలు బస్సుల్లో వెళ్లాలంటే తం బళ్లపల్లె మండల కేం ద్రం నుంచి ముదివేడు క్రాస్ వరకు వెళ్లి, అక్క డి నుంచి మరో బస్సు లో ఎక్కాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, ఇతర సొంత వాహనాల్లో అయితే మండల కేంద్రం నుంచి కన్నెమడుగు మఠం, అక్కడి నుంచి కోట కొండ, కుక్కరాజు పల్లె లేకుంటే కలిచెర్ల, గుర్రం కొండ మీదుగా వెళ్లాల్సి ఉంది. లేదా పెద్ద మండ్యం, చిన్న మం డ్యం మీదుగా రాయ చోటికి వెళ్లాల్సి ఉంది. ఈ రెండు మార్గాల గుండా తంబళ్లపల్లె నుంచి జిల్లా కేంద్రం సుమారు 65 నుంచి 70 కి.మీ దూరం ఉంటుంది. అదే శివపురం రోడ్డు పనులు పూర్తైతే తంబళ్లపల్లె నుంచి నేరుగా చిన్నమండ్యం మీదుగా జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. ఈ రోడ్డు ఏర్పాటు చేస్తే జిల్లా కేంద్రానికి ఇక్కడి నుంచి దాదాపు 20 కి.మీ పైన దూరం తగ్గే అవకాశం ఉంది.

తంబళ్లపల్లె మరింత అభివృద్ధి

తంబళ్లపల్లె-శివపురం రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే నియోజకవర్గ కేంద్రమైన తంబళ్లపల్లె మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. జిల్లా కేంద్రం నుంచి అతి తక్కువ సమయంలో తంబళ్లపల్లెకు చేరుకుని, అక్కడి నుంచి నేరుగా ములకలచెరువు, బి. కొత్తకోట మీదుగా బెంగళూరుకు చేరుకోవచ్చు. కడప, రాయచోటి, చిన్నమండ్యం, పెద్దమండ్యం తదితర ప్రాంతాల రైతులు సులభంగా బెంగళూరు, చింతామణి మార్కెట్లకు వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలు పెరిగి అన్ని వ్యాపార లావాదేవీలు పెరుగుతాయి. రవాణా సౌకర్యం పెరిగితే ఆ ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

అటవీ శాఖ అనుమతులే అడ్డు

రోడ్డు నిర్మాణంలో భాగంగా పోయే అటవీ భూమిని తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లె వద్ద సర్వే నెంబరు 2024/25లో సుమారు 50 ఎకరాలకు పైగా భూమిని అటవీ శాఖకు కేటాయించినట్లు అధికారులు చెపుతున్నారు. అయితే, కరోనా లాక్‌డౌన్ , అధికారుల బదిలీ వంటి కారణలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

శివపురం రోడ్డు పూర్తి చేస్తాం

తంబళ్లపల్లె-శివపురం రోడ్డు పూర్తి చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 12 న తంబళ్లపల్లెలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రకటించారు. దీంతో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు మండలాల ప్రజల్లో ఆనందం నెలకొంది.

రోడ్డు నిర్మాణం పూర్తైతే మరింత అభివృద్ధి



తంబళ్లపల్లె-శివపురం రోడ్డును పూర్తి చేస్తే తంబళ్లపల్లె అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి ప్రజలు రాయచోటికి వెళ్లాల న్నా .. కడప, రాయచోటి ప్రాంతాల నుంచి బెంగళూరుకు వెళ్లాలన్న ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా రైతులు పండించిన పంటలు బెంగళూరుకు తరలించుకో వడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.

- బాలకృష్ణ, మండల నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం పూర్తి



తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి జయచంద్రారెడ్డి నేతృత్వం లో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధి స్తోంది. తంబళ్లపల్లె- శివపురం రోడ్డు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మంత్రితో మాట్లాడి పూర్తి చేయడానికి కృషి చేస్తామని విజయోత్సవ ర్యాలీలో టీడీపీ ఇంచార్జి ప్రక టించారు. అదేకాకుండా కోసువారిపల్లె రోడ్డు, కాలువపల్లె రోడ్డు పనులు కూడా త్వరలో చేపట్టి ప్రజల రోడ్డు కష్టాలు తీరుస్తామని అన్నారు.

- డేరంగుల చంద్ర, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

● సబ్‌కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): ప్రజా పరిష్కార వేదికలో ప్రజలు అందజేస్తున్న అర్జీలను సంబంధిత శాఖ అధికారులు త్వరగా పరిష్కరించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియా దేవి అధికారులను సూచించారు. సోమవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదికలో పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అందులో భాగంగా ఊటుకూరు గ్రామ పొలానికి చెందిన సర్వేనంబరు 552, 1497లో పూర్వీకుల నుంచి తమ పొలాలకు వెళ్లేందుకు రస్తా ఉందన్నారు. కొందరు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. దీనిపై గతంలో రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు సర్వేచేసి హద్దులు ఏర్పరచారని తెలిపారు. 552 సర్వేనంబరులో 10 సెంట్లు స్థలం వంక పొరంబోకు అని తెలిపారు. కావున పొలానికి వెళ్లేందుకు దారి చూపాలని కోరారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ నిదియాదేవి

నాణ్యమైన విద్య అందించాలి: డీవైఈవో

పీలేరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన పీలేరు మండలం రేగళ్లు పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లె ప్రాథమిక పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహా విద్య బోధించడం కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, ఉన్నతమైన విలువలు నేర్పించాలని సూచించారు. ఉపాధ్యా యులు విధిగా పని వేళలు పాటించాలని సూచించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులకు ఉచితంగా భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు తదితర విద్యాసామగ్రి ఇస్తున్నామని చెప్పారు. ప్రయివేట్ ప్రకటనలకు మోసపోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. మెగా పేరెంట్స్ డేని విజయవంతం చేయాలని సూచించారు. ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, సీఆర్‌పీ మాధవి పాల్గొన్నారు.



శెట్టిపల్లె పాఠశాలను తనిఖీ చేస్తున్న డీవై ఈవో లోకేశ్వర్ రెడ్డి

మురుగు కాలువ పనులు ప్రారంభం

పీలేరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో మురుగు కాలువ నిర్మాణ పనులుప్రారంభమయ్యాయి. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'తవ్వేశారు ... వదిలేశారు' అన్న కథ నానికి స్పందించిన కాంట్రాక్టర్ యుద్ధ ప్రాతిపదికన సోమవారం పనులు ప్రారంబించారు. సుమారు ఏడు నెలల క్రితం మురుగు కాలువ నిర్మాణం కోసం జేసీబీతో కాలువను తవ్వి వదిలేశారు. దీంతో ఈ ప్రాంత వ్యాపారులు, వాహన చోదకులు, స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఆంధ్రజ్యోతి గుర్తు చేసింది. దీంతో స్పందించిన పీలేరు గ్రామ పంచాయతీ అధికారులు, కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంబించారు. దీంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మురుగు కాలువ పనులు చేస్తున్న కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయండి

● తహసీల్దారుకు వీవోఏ వినతి

వాల్మీకిపురం, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను సైతం పరిగణనలోకి తీసుకోకుండా తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని వాల్మీకిపురం మండలంలోని చింతపర్తికి చెందిన సంఘమిత్ర సుమలత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ పామిలేటిని కలిసి వినతి పత్రం అందజేశారు. చింతపర్తి గ్రామం 6 వీవోఏ (సంఘమిత్ర)గా పనిచేస్తున్న తాను కొన్ని ఇబ్బందుల కారణంగా విధులకు దూరంగా ఉన్నానని, సంఘమిత్రగా కొనసాగేందుకు గతంలో హైకోర్టును ఆశ్రయించగా, గతేడాది సెప్టెంబరు 12న సంఘమిత్రగా కొనసాగించేందుకు ఉత్తర్వులు కూడా ఇచ్చిందన్నారు. అయితే విధుల్లోకి తీసుకుండా సంబంధిత అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘమిత్రలు

రిటైరయిన ఆరేళ్లకు మధ్యంతర పెన్షన్ మంజూరు

● విచారణ ఎదుర్కొంటున్న ఏడీఏ సోమశేఖర్ రెడ్డి

కలికిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వివిధ ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న ఒక అధికారికి ఉద్యోగం నుంచి రిటైరయిన ఆరేళ్ల తరువాత మధ్యంతర పెన్షన్ మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ శాఖలో కె.సోమశేఖర్ రెడ్డి కడప అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసే కాలంలో కొన్ని అభియోగాలు నమోదయ్యాయి. వీటిపై విచారణ జరుతుండగానే ఆయన 2019 జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. అయితే విచారణ కారణంగా అప్పటి నుంచి ఆయనకు పెన్షన్ మంజూరు కాలేదు. పదవీ విరమణానంతరం అందాల్సిన ప్రయోజనాలేవీ అందలేదు. విచారణలో జాప్యం జరుగుతున్న కారణంగా తనకు కనీసం మధ్యంతర పెన్షన్ మంజూరు చేయాలని గత మార్చి నెలలో ఆయన చేసుకున్న విన్నపాన్ని పరిశీలించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టరు గత జూన్ 18న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. పరిశీలించిన ప్రభుత్వం మధ్యంతర పెన్షను మంజూరుకు సంబంధించిన నియమాల మేరకు మొత్తం పెన్షన్ రూ.28,845లో 75 శాతం మించకుండా చెల్లించాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా నిబంధనల మేరకు రావలసిన పెన్షన్‌లో రూ.21,634లు మంజూరు చేసింది. కమ్యుటేషన్, గ్రాట్యుటీ, తదితర పదవీ విరమణానంతరం చెల్లించాల్సిన ప్రయోజనాలన్నీ విచారణ పూర్తయ్యే వరకూ పెండింగ్‌లో ఉంచాల్సిందిగా తెలియజేస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

హంసవాహనంపై సిద్దేశ్వరుడి విహారం

రాజంపేట టౌన్, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): తాళ్లపాక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామిని, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారిని ప్రత్యేకఅలంకరణలో కొలువు దీర్చారు. హంస వాహనంపై సిద్దేశ్వరస్వామిని, చిన్నశేష వాహనంపై చెన్నకేశవస్వాములను తాళ్లపాక మాడవీధుల్లో ఊరేగించారు. చివరగా చెన్నకేశవస్వామివారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరికి టీటీడీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



హంస వాహనంపై విహరిస్తున్న సిద్దేశ్వరస్వామి

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తమ కూతురు కనిపించడం లేదంటూ పట్టణంలోని బండ్లవంకకు చెందిన సునీత ఫిర్యాదు చేసినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరులోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో జోష్ణవి 8వ తరగతి చదువుతుండగా, ఆమె తల్లి సునీత అదే పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తోంది. ఆదివారం జోష్ణవి జన్మదినం కావడంతో సునీత తన కూతురిని ఇంటికి తీసుకెళ్లింది. ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు ఇంటిలోనే ఉన్న జోష్ణవి కనిపించకుండా పోయిందని ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె కోసం గాలిస్తున్నారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన సమయంలో జోష్ణవి బ్లూ కలర్ గౌను, బంగారు కమ్మలు, మాటీలు ధరించి ఉన్నదని, ఆమె ఆచూకీ తెలిసిన వారు 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



జోష్ణవి (ఫైల్ ఫొటో)

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

కురబలకోట, జూలై 7(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ పడమటి సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన శివశంకర్(52) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య పిల్లలు ఉన్నారు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. కాగా, సోమవారం ఉదయం అతను మరణించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేశారు. అతనిని ఎవరైనా హత్య చేశారా..లేక మద్యం కారణంగా మృతి చెందాడో తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం




మృతదేహాన్ని వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సర్ట్) ఉస్మాన్ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఝరికోన మొరవ మడుగులో ఆదివారం గల్లంతైన ఉస్మాన్ (22) మృతదేహాన్ని సోమవారం అగ్నిమాపక సి బ్బంది వెలికితీశారు. పో లీసులు తెలిపిన వివరాల మేరకు... కర్నూలు జిల్లాకు చెందిన మహమ్మద్ అస్లాం పెద్ద కుమారుడు ఉస్మాన్ రాయచోటిలో కోళ్ల ఫారంలో పని చేస్తుంటాడు. ఇతను రాయచోటి మదరసాలో చదువుకున్నాడు. శెట్టిపల్లి, దేవపట్ల అసంజివాండ్లపల్లె మసీదులో గురువులుగా పనిచేస్తున్న స్నేహితులతో కలిసి ఆదివారం ఝరికోన మడుగు ప్రాంతంలో సరదాగా గడిపేందుకు వెళ్లిన అతను ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. శెట్టిపల్లె గ్రామ వీఆర్‌ఏలు మృతదేహాన్ని వెతికించి శవ పరీక్షలకు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశా వర్కర్ ఆత్మహత్యాయత్నం

పీలేరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తన కుటుంబంపై జరిగిన దౌర్జన్య కాండతో మనస్తాపానికి గురైన ఓ ఆశా వర్కర్ ఆత్మాహత్యా యత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యుల కథనం మేరకు పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీలో కోళ్లఫారానికి చెందిన బి.లక్ష్మీ దేవి(41) ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. అదే గ్రామానికి చెందిన పి.వెంకటరమణ, ఒ.బాలకృష్ణ, వి.రామ్మూర్తి, వి.గురునాథం, ఒ.నాగ రాజ అనే వ్యక్తులు ఆదివారం ఉదయం లక్ష్మీదేవి కుటుంబానికి చెందిన భూమిని ఆక్రమించుకోవడ మే కాకుండా, అడ్డుకోబోయిన ఆమెపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీదేవి విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. దానిని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి

ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి

● పోలీసు అధికారులకు విద్యాసాగర్‌నాయుడు ఆదేశం

రాయచోటిటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ చేసి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదు చేయడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనివారు తమకు సమీపంలోని పోలీస్‌స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. అక్కడ ఇచ్చే ఫిర్యాదులను కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో బాధితులకు న్యాయం చేస్తామని తెలియజేశారు. జిల్లా పరిధిలోని ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు నుంచి పీ. వెంకట్రమణ, టీ. కొత్తకోట నుంచి పీ. మల్లేశ్వరమ్మ, కలకడ నుంచి వెంకటయ్య, రాయచోటి మండలం ఏపిలవంకపల్లి నుంచి నూర్జహాన్‌లు నడవలేని పరిస్థితిలో కూడా తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ నేరుగా వారి వద్దకే వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



నడవలేని స్థితిలో ఉన్న బాధితుడి వద్దకే వచ్చి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

14 ఎర్రచందనం దుంగలు పట్టివేత

●ముగ్గురి అరెస్ట్ .. ఒకరు పరార్



స్వాధీనం చేసుకున్న కారు, దుంగలు, నిందితులతో అటవీ సిబ్బంది

సిద్దవటం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి 14 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలిపారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె వివరాలు వెల్లడించారు. సిద్దవటం గ్రామ శివారులోని అంజనేయగుడి సమీపాన ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించగా కడప మండలం రామాంజనేయపురం ప్రాంతానికి చెందిన సన్నపూరి వెంకటరమణ, కొప్పర్తికి చెందిన సుబ్బారెడ్డి, సిద్దవటం మండలం కమ్మపాలేనికి చెందిన శిఖామణి పట్టుబడగా ఓ వ్యక్తి పారిపోయాడన్నారు. నిందితుల నుంచి 14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన వ్యక్తి తిరుపతి నగరానికి చెందిన గిరిబాబు అని విచారణలో తేలిందన్నారు. నిందితుల నుంచి ఒక కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను తిరుపతి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓబులేశు, ఎఫ్‌బీవో పెంచల్‌రెడ్డి, మధు, ఏబీవో హైమావతి, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది సాహెబ్‌బావి బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

విషం తాగి ఒకరి ఆత్మహత్య

నందలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఇంటికి వచ్చినందుకు భార్య మందలిం చడంతో ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెంకటాద్రిపురం ఎస్టీ కాలనీకి చెందిన బొమ్మల నారాయణ(25) కడప పట్టణంలో ఇటుకల బట్టీలో పనిచేసేవాడు. అతనికి రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మునెమ్మతో వివాహం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతను విషం తాగాడు. ఈ విషయం గమనించిన భార్య రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



నారాయణ మృతదేహం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నమండెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప- బెంగుళూరు జాతీయ రహదారిపై రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చెర్లోపల్లి గ్రామ పంచాయతీ చీమలకుంటవారి పల్లెకు చెందిన కే. సుబ్బరాజ (61) కడప రిమ్స్‌కు తరలించగా ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నమండెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండ్లూరు గణపతి విగ్రహం మళ్లీ ధ్వంసం

● ఆరేళ్ల వ్యవధిలో మూడు సార్లు యత్నం

● స్థానికుల్లో ఆగ్రహం

కలికిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరు మూలస్థానమ్మ అమ్మవారి ఆలయం ఎదురుగా వున్న వినాయక విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగుల పెకలించి దూరంగా తీసుకుపోయి ధ్వంసం చేసేందుకు విఫల ప్రయత్నం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం ఇదే మొదటిసారి కాదు. 2019లో ఒకసారి గుప్త నిధుల కోసం విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించి సాధ్యపడక వెళ్లిపోయారు. అనంతరం 2022 ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం అర్ధరాత్రి విగ్రహాన్ని పెకలించి గుప్త నిధుల కోసం ఉదర భాగాన్ని పగలగొట్టడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. నెల్లూరుకు చెందిన ఒక ముఠా ఈ ప్రయత్నాలు చేయగా, స్థానికులు కూడా సహకరించినట్లు అప్పట్లో బలంగా ఆరోపణలు వచ్చాయి. పలు దఫాలుగా జరుగుతున్నా పోలీసులు తీవ్రంగా దర్యాప్తు చేయడం లేదనే ఆరోపణలతో గ్రామస్తులు పలు దఫాలు నిలదీసే వరకూ వెళ్ళింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఐదుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనుమానితులను తహసీల్దారు ముందు హాజరుపరిచి రూ.60 వేల పూచీకత్తుతో బైండోవరు చేయించి వదిలేశారు. దీంతో ఆగ్రహోదగ్రులైన గ్రామస్తులు పోలీసులకు వ్యతిరేకంగా రోడ్డు పైకి వచ్చే పరిస్థితి దాపురించింది. దుండగులతో కుమ్మక్కైన పోలీసులు కేసును నీరుగారుస్తున్నారనే ప్రచారం కూడా ఊపందుకుంది. రోజు రోజుకూ గ్రామస్తుల నుంచి వత్తిడి పెరగడంతో అప్పటి ఎస్‌ఐ ఉమామహేశ్వరావు 2022 ఫిబ్రవరి 8న గ్రామస్తులను సమావేశపరిచి వదంతులను నమ్మొద్దని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. వారం పది రోజుల్లో నిందితులను పట్టుకుని కేసును ఒక కొలిక్కి తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. ఈ లోగా విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని సూచించారు. అనంతరం ఫిబ్రవరి 19న మూలస్థానమ్మ ఆలయ నిర్వాహకులు వినాయక విగ్రహాన్ని సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠింపజేశారు. ఆ తరువాత కేసు దర్యాప్తు కూడా మూలన పడింది. మూడేళ్ల అనంతరం మళ్లీ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి యత్నించడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటు మూలస్థానమ్మ ఆలయంలో కూడా తరచూ దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు కఠినంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.





మూడేళ్ళ క్రితం ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం, ఆదివారం ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన విగ్రహం

బాలిక అదృశ్యం... వేంపల్లెలో ఉద్రిక్తత

- పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన బంధువులు
- అడ్డుకున్న పోలీసులు
- నాలుగుగంటలపాటు ఉద్రిక్తత
- బాలిక ఆచూకీ దొరకడంతో కథ సుఖాంతం



వేంపల్లె పోలీసు స్టేషన్ వద్ద గుమిగూడిన జనం



బాలికకు చక్కెర నీళ్లు తాపిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో ఓ బాలిక అనుమానాస్పద స్థితిలో అదృశ్యం కావడం.. ఆ బాలిక బంధువులు ఆందోళనకు దిగడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాలిక తరపు బంధువులు, కుటుంబ సభ్యులు, ఇతరులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. బాలిక అదృశ్యానికి కారణమైన పోలీసులు అదుపులో ఉన్న యువకులను అప్పగించాలంటూ ఆగ్రహంతో పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. పోలీస్‌స్టేషన్ గోడలు ఎక్కి లోపలున్న యువకులను పట్టుకోవాలని విఫలయత్నం చేశారు. పోలీస్‌స్టేషన్ కిటికీ అద్దాలు పగులగొట్టారు. డీఎస్పీ మురళీనాయక్, చుట్టుపక్కల సీఐలు, ఎస్ఐలు చేరుకుని పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన జనాన్ని అడ్డుకున్నారు. నాలుగు గంటల పాటు నాటకీయ పరిణామాల అనంతరం బాలికను వెతుక్కుంటూ వెళ్లిన కొందరు బంధువులు ఆచూకీ తెలిసిందని పోలీస్‌స్టేషన్‌కు రాత్రి 10గంటల సమయంలో ఫోన్ చేశారు. దీంతో సీఐ నరసింహులు ఈ విషయం వారి బంధువులకు చెప్పడంతో ఉద్రిక్తత సద్దుమణిగి జనమంతా వెనుదిరిగి వెళ్లారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా...

వేంపల్లె పట్టణం పక్కీరుపల్లెకు చెందిన మాబువల్లి చింతలమడుగుపల్లె బట్లపల్లె వద్ద మేకల దొడ్డిని ఏర్పాటుచేసుకొని చుట్టుపక్కల అడవిప్రాంతం, పొలాల్లో మేపుకొనేవారు. సోమవారం భోజనం తీసుకెళ్లిన కుమార్తె సుమియ(18)ను కొంతసేపు మేకలు మేపుకొని రావాలంటూ తండ్రి సూచించడంతో తోలుకెళ్లింది. ఆ తర్వాత బాలిక అదృశ్యమైంది. తండ్రి కుమార్తె కోసం వెతుకగా కనిపించలేదు. మధ్యాహ్నం ప్రాంతంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాలిక కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ నరసింహులు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశారు. ఇంతలో ఓ వీడియో బయటకు వచ్చింది. ఆ వీడియోలో అదృశ్యమైన బాలిక సుమియ దండంపెడుతూ భయంభయంగా ఉన్నట్లు కనిపించింది. ఆ వీడియోల ఆధారంగా ముగ్గురు యువకులను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. అడవికి వెళ్లి బాలికతో మాట్లాడి వచ్చామని, తర్వాత ఏమైందో తెలియదని యువకులు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఎక్కడకు వెళ్లింది, ఏమై ఉంటుందో అన్న ప్రశ్నలతో ఆ యువకులను పూర్తిస్థాయిలో విచారించారు. ఈ లోగా బాలిక తరపు బంధువులు సాయంత్రం 6 గంటల నుంచే ఒక్కొక్కరుగా చేరుకున్నారు. పెద్దఎత్తున వందలాది మంది రాత్రి 7గంటల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బాలిక ఏమైందో చెప్పాలంటూ మొదట పోలీసులను ప్రశ్నించారు. అప్పటికి పోలీసులకు పూర్తి సమాచారం లేకపోవడంతో విచారణకు కొంత సమయం ఇవ్వాలని నచ్చజెప్పినప్పటికి గుమిగూడిన జనం పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. యువకులను అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్ కిటికీలను రాళ్లతో బద్దలు కొట్టారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు వద్దంటున్నా లోపలకు వెళ్లేందుకు గట్టిగా ప్రయత్నించారు. అయితే పోలీసులు అడ్డుకొని చుట్టుపక్కల సీఐలు, ఎస్ఐలను పిలిపించుకొని జనాన్ని లోపలికి రాకుండా అడ్డుకున్నారు. గోడలు ఎక్కి పైనున్న యువకుల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారించారు. పోలీసులకు, జనానికి తీవ్ర తోపులాట జరిగింది. యువకులను ఏమైనా చేస్తారన్న అనుమానంతో కింద లాకప్‌లోకి తీసుకెళ్లి తాళాలు వేశారు. ఇలా సుమారు 5 గంటల పాటు వేంపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఏం జరుగుతుందోన్న ఆందోళనతో ప్రత్యేక పోలీసు దళం రావాలంటూ కడపకు సమాచారం ఇచ్చారు. ఈ లోగా రాత్రి 10గంటల సమయంలో బాలిక అదృశ్యంపై న్యాయం చేయాలంటూ ఫిర్యాదు పత్రాన్ని డీఎస్పీకి, సీఐకి అందించారు. అదే సమయంలో బంధువులు అడవిప్రాంతంలో వెతుకులాడేందుకు వెళ్లిన బంధువులకు బాలిక ఆచూకీ తెలిసింది. అక్కడి నుంచే ఫోన్ చేసి బాలిక క్షేమంగా ఉందంటూ సీఐ నరసింహులుకు తెలియజేశారు. ఆయన బాలిక తరపు బంధువులతో మాట్లాడించారు. దీంతో బాలిక క్షేమంగా ఉంది ఇప్పుడే సమాచారం అందింది వెంటనే అప్పగిస్తామంటూ డీఎస్పీ మురళీనాయక్ జనానికి విజ్ఞప్తి చేయడంతో పాటు అక్కడున్న పోలీసు బలగాలు జనాన్ని బయటకు వెళ్లాలని సూచంచడంతో వెనుదిరిగి వెళ్లారు. హుటాహుటిన డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో బాలికను పిలుచుకొచ్చేందుకు రాత్రి 10గంటల సమయంలో అడవికి వెళ్లారు.

అసలేం జరిగిందంటే..

బాలిక అదృశ్యమైన ఘటనలో అసలు ఏం జరిగిందన్న విషయంపై పోలీసులు, స్థానికుల ద్వారా తెలిసిన వివరాల మేరకు.. బాలిక మేకలు మేపుకొనేందుకు మేకల దొడ్డి నుంచి వెళ్లింది. బాలికతో యువకులు మాట్లాడుకుంటుండగా మేకలు సమీప పొలంలోకి వెళ్లాయి. పొలం రైతు బాలిక తండ్రికి ఫోన్ చేశారు. మేకలు పొలంలోకి వచ్చాయి మీ పాప ఏం చేస్తోందంటూ అడగడంతో బాలిక తండ్రి మేకలు ఉన్న ప్రాంతానికి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక భయాందోళనకు గురై తండ్రి చూస్తే అరుస్తాడేమోనన్న భయంతో అడవిలోకి పారిపోయింది. యువకులు ఇంటికి వచ్చేశారు. దీనితో బాలిక అదృశ్యమైనట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రిమ్స్‌కు బాలిక..

అడవికి వెళ్లిన డీఎస్పీ మురళీనాయక్, పోలీసులు బాలికను వేంపల్లెకు తీసుకొచ్చి బంధువులకు చూపించారు. మధ్యాహ్నం నుంచి భోజనం లేకపోవడం, భయం కారణంగా మాట్లాడలేకుండా ఉన్న బాలికకు డీఎస్పీ చక్కెర నీళ్లు తాపించారు. అనంతరం వైద్యచికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి బాలిక క్షేమంగా ఉందని, అయితే నీరసంగా ఉండటంతో రిమ్స్‌కు తరలించామని అన్నారు. బాలిక మాట్లాడితే అడవిలో ఏం జరిగిందనేది తెలుస్తుందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న దంపతుల అరెస్టు

2.8 కేజీల గంజాయి, బైకు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి

కడప క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం డీటీసీ సర్కిల్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్న దంపతులను అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సోమవారం రిమ్స్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వల్లూరు మండలం తోళ్లగంగన్నపల్లె గ్రామానికి చెందిన చెన్నుబోయిన రాము గతంలో క్యాబ్ డ్రైవరుగా పని చేస్తుండేవాడు. ఆ సమయంలో కాకినాడ టౌన్ తుమ్మలపేటకు చెందిన వాసుపిల్లి భారతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీళ్లు కడప శాస్త్రినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఎలాంటి పనులకు వెళ్లకుండా గంజాయి వ్యాపారం చేస్తే తక్కువ సమయంలో డబ్బులు బాగా సంపాదించవచ్చనే ఆశతో మహేశ్ నుంచి గంజాయి తెచ్చుకుని విక్రయించేవారు. సోమవారం డీటీసీ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తున్న సమయంలో దంపతులు బైకుపై గంజాయి పెట్టుకుని వస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 2.8 కేజీల గంజాయి, బైకు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

మహిళా టీచర్ ఆత్మహత్యాయత్నం

మైదుకూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనిపెంట బీసీ గురుకుల పాఠశాలలో సోమవారం జ్యోతి అనే బయాలజీ టీచర్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పాఠశాలలో సరిగ్గా బోధన చేయడం లేదంటూ ప్రిన్సి పాల్ నిర్మల వేధింపులకు పాల్పడటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు విలేకరులకు తెలిపారు. ఆమెను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ నిర్మలను వివరణ కోరగా ఉదయం అసెంబ్లీ జరిగిన తరువాత జ్యోతి మేడం టీచింగ్ డైరీ, లెసన్ ప్లాన్‌పై సంతకం చేయాలని కోరారు. అయితే పని చేయని రోజులలో పనిచేసినట్లు రాసు కొచ్చారు. దీంతో నేను ఎలా సంతకం చేయాలని ప్రశ్నించి.. నేను ఇప్పుడు కొద్దిగా బిజీగా ఉన్నాను. తరువాత చూస్తాను అని చెప్పి పంపానని తెలిపారు. అయితే కొద్ది సేపటికే జ్యోతి మేడం నిద్ర మాత్రలు మింగారని మా స్టాఫ్ చెప్పగా వెళ్లి చూశాను. కానీ నేను మాట్లాడిన కొద్దిసేపటికే నిద్ర మాత్రలు ఆమెకు ఎలా వచ్చాయి.. నిద్రమాత్రలు మింగిన నిమిషాల్లోనే బయట వ్యక్తులు ఎలా పాఠశాలలోకి ఎలా వస్తారని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ప్రీప్లాన్‌గా చేస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే విచారించి ఎవరి తప్పు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి



శివారెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య



జి.శివారెడ్డి (ఫైల్)

పులివెందుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉలిమెల్ల లైన్‌మన్ జి.శివారెడ్డి (45) విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. బంధువులు, విద్యుత్ సిబ్బంది సమాచారం మేరకు వివరాల్లోకెళితే..... ఉలిమెల్ల లైన్‌మన్‌గా పనిచేస్తున్న జి.శివారెడ్డి ఉదయం 7.30 గంటల ప్రాంతంలో డ్యూటీకి వెళ్లారు. ఓ చీనీతోటలో విద్యుత్ లైన్ మరమ్మత్తులకు గురికావడంతో సబ్ స్టేషన్‌లో శివారెడ్డి ఎల్‌సీ తీసుకుని వెళ్లారు. కానీ మరమ్మత్తు పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో శివారెడ్డి షాక్‌కు గురై విద్యుత్ తీగలపైనే పడి మృతి చెందాడు. కాగా, శివారెడ్డి ఫోన్ రింగ్ అవుతున్నా ఎందుకు రాలేదని మరో లైన్‌మన్ ఆయను వెతుకుతూ వెళ్లగా.. విద్యుత్ స్తంభంపై మృతదేహం కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వారితో కలిసి శివారెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. పోస్టుమార్టం నిర్వహించారు. శివారెడ్డి అన్న నాగరాజరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శివారెడ్డికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆఫీసుల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు : మంత్రి



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్, జులై 7 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను పనులు చేయకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకోవద్దని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల పెట్టుబడులశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక 21వ వార్డులోని ఆకుల వీధిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలిసి మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొందరు మహిళలు పెన్షన్, రేషన్ కార్డులు, హౌసింగ్ తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొంటారా అని మండిపడ్డారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాక్షస పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. అనంతరం కడప జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రక్తదాన వారోత్సవాల పోస్టర్‌ను మంత్రి, ఎమ్మెల్యేలు విడుదల చేశారు. పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, ఆకుల కృష్ణయ్య, తుపాకుల రమణ, ఆర్.శ్రీనివాసులు, పిచ్చపాటి వీరారెడ్డి, చిగురు పాటి సుబ్బరాయుడు, ధనపాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమంతో సుపరిపాలన : మంత్రి సవిత



పింఛన్లు వస్తున్నాయా అంటూ వృద్ధులను ఆరా తీస్తున్న మంత్రి

లింగాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమం కలగలిపిన సుపరిపాలన ఏడాదికాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు అందించారని రాష్ట్ర బీసీ సాంఘిక సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవిత అన్నారు. లింగాల ఆశ్రమంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే పరిపాలనలో అనేక మార్పులు చేపట్టి ప్రజలకు ఎన్నికలలో హామీ ఇచ్చిన మేరకు పింఛన్లను రూ.3వేలనుంచి రూ.4వేలకు, వికలాంగులకు రూ.6వేలకు పెంచడం జరిగిందన్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందిస్తూ దీపం పథకం అమలు చేయడం జరిగిందన్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని ఒకరికి పరిమితం చేయకుండా కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికీ అందిస్తూ రాష్ట్రంలో 67.27లక్షల మంది విద్యార్థులకు రూ.10వేలకోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ విడుదల చేశారని, రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకువస్తూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. కాగా, అరటి రైతులకు పెట్టుబడి రాయితీ విడుదల కాలేదని, నియోజకవర్గం ప్రజలకు తాగునీటి సరఫరా చేసే వాటర్ గ్రిడ్ పనులలు నత్తనడకన సాగుతున్నాయని, విలేకరులు మంత్రి దృష్టికి తీసుకురాగా, పెట్టుబడి రాయితీ విడు దలకు, వాటర్ గ్రిడ్ పథకం పూర్తికి చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే ప్రజలు విన్నవించిన పలు సమస్యలను పరిష్కరించాలని సంబంధించిన శాఖ అధికారులను ఆదేశించారు. పులివెందుల టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బీటెక్ రవి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ మద్యం ద్వారా దోచుకునేందుకు తనకు నచ్చిన బ్రాండ్లను ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాణ్యమైన మద్యం ప్రవేశపెట్టడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుచేయడం, ఉద్యాన రైతులకు ఎంతో అవసరమైన డ్రిప్ పరికరాలను దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి, ధనుంజయనాయుడు, బీజేపీ పులివెందుల నియోజకవర్గ కన్వీనర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితో ఉద్యాన తోటల పెంపకం

- జిల్లాలో 2700 ఎకరాల్లో సాగు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



టెంకాయ మొక్కలు నాటుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపాధి హామీతో ఉద్యాన తోటల పెంపకం చేపడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం సంబేపల్లె మండలం మోటకట్లకు చెందిన రైతు రాము, వంగిమళ్లవాండ్లపల్లెలో రైతు వంగిమళ్ల సురేశ్‌రెడ్డి పొలంలో డ్వామా పీడీ వెంకటరత్నంతో కలిసి కొబ్బరి మొక్క లు నాటి ఉద్యాన తోటల పెంపకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 2700 ఎకరాల్లో వివిధ రకాల ఉద్యాన తోటల పెంపకాన్ని ఉపాధి హామీతో రైతులు చేపడుతున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు మండలాల్లో 1084 ఎకరాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో మామిడి తోటలు అధికంగా ఉన్నాయని, మామిడి కాకుండా సపోటా, దానిమ్మ, టెంకాయ వివిధ రకాల పండ్ల తోటలను పెంచుకోవాలని రైతులకు తెలి పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, ఏపీడీ మధుబాబు, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, ఏపీవో రెడ్డిజవహర్, శివప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శశిధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, దేవపట్ల ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, చంద్రబాబునాయుడు, సుబ్బరాజుయాదవ్, శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొండగంగమ్మ ఆలయానికి రూ.2 లక్షల విరాళం

పెండ్లిమర్రి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నందిమండలం గ్రామ సమీపంలో పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన కొండగంగమ్మతల్లి ఆలయానికి రూ.2లక్షల విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ మారుతీ తెలిపారు. అనంతపురం పట్టణానికి చెందిన యతీష్‌రెడ్డి రూ.51,116 లు, శౌరీస్‌రెడ్డి రూ.51,116లు, పద్మావతి, నరసింహారెడ్డి దంపతులు రూ.1,01,116ల విరాళం అందచేశారన్నారు. ఈ నిధులను సీజీఫ్ మ్యాచింగ్ ఫండ్ ద్వారా ఆలయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం ఉపయోగిస్తామని ఈఓ తెలిపారు.

నేడు ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ బాలుర ఎంపికలు

కడప స్పోర్ట్స్, జులై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈనెల 8వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాలుర జిల్లా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డేనియల్ ప్రదీప్ తెలిపారు. క్రీడాకారులు 2012 జనవరి 1 నుంచి 2013 డిసెంబరు 3 మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు.

బ్యానర్ తగిలిస్తూ..
కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు



మృతి చెందిన ఖాజాపీర్

మదనపల్లె అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): బ్యానర్ తగిలిస్తూ కరెంట్ షాక్ గురై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మదనపల్లె పట్టణం సీటీఎం రోడ్డులోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివ రాల మేరకు... గొల్లపల్లెకు చెందిన ఖాదర్‌బాషాకు మారుడు ఖజాపీర్ (29) బ్యానర్లకు లైటింగ్ వేసే పనిచేసేవాడు. సోమవారం రాత్రి సీటీఎం రోడ్డులోని కరెంటు ఆఫీస్ ఎదురుగా మిద్దెపై బ్యానర్ తగిలిస్తుండగా గాలి ఎక్కువగా రావ డంతో బ్యానర్ కరెంటు తీగలపై పడింది. వెంటనే కరెంటు షాక్‌కు గురై ఖాజా పీర్ అక్కడే మిద్దెపై కుప్పకూలిపోయాడు. స్థానికులు కిందకు దించి వెంటనే ఆటోలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయపడిన వ్యక్తిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిం చారని స్థానికులు తెలిపారు. అతని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పెండ్లిమర్రి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎల్లటూరు,పెండ్లిమర్రి,కొండూరు గ్రామాల పరిధిలో సోమవారం మొహర్రం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా కొండూరు గ్రామంలో మస్తాన్ స్వామి ఉరుసు ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి.కుల మతాలకు అతీతంగా మొహర్రం రోజున పీర్లను ఊరేగించి పండుగను జరుపుకోవడం మతసామరస్యానికి ప్రతీక.

టెండరు వేసిన వారికి గదులు కేటాయించాలి

కడప మారుతీనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండులో టెండరు వేసిన వారికే గదులు కేటాయించాలని, బస్టాండు ఆవరణంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీయం పార్టీ కడప నగర కమిటీ ఆధ్వర్యంలో కడప ఆర్టీసీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ మాట్లాడుతూ కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో వర్షం వస్తే డ్రైనేజీ నీరంతా బస్టాండు చుట్టూ నీరు నిలుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారన్నారు. కడప బస్టాండు చుట్టుపక్కల వరద కాల్వ వచ్చినప్పుడు బస్టాండు కాంప్లెక్స్‌లో దుకాణదారులు నష్టపోయారని వారికి బాడుగులు తగ్గిస్తామని హామీ ఇచ్చినా కూడా ఇంత వరకు ఏ మాత్రం చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. ఆర్టీసీ బస్టాండు కాంప్లెక్స్‌లో టెండర్లు వేసి ఆరు నెలలు అవుతున్నా గదులు చూపెట్టడంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు

వల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించుకోవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ కె.సాయిమహేశ్వరి అన్నారు. వల్లూరు కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారాప్రకృతి వ్యవసాయన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా వల్లూరు మండల పరిధిలోని పెద్దలేబాక గ్రామంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో మొదటిరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించడంలో వివిధ పథకాల ద్వారా ఎంతో కృషి చేస్తున్నాయని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.మహేశ్ బాబు ,డాక్టర్ సురేశ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోండి

వీరపునాయునిపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్-2025 కాలానికి పంటల బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో శ్యామ్‌బాబు రైతులను కోరారు. రైతులు మూడు రకాలుగా బీమా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. బ్యాంకుల్లో రైతులు రుణం రెన్యువల్ ద్వారా చేసుకోవచ్చన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా గాని లేదా రైతులు స్వయంగా ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. రైతులు ప్రీమియం చెల్లించేందుకు వెళ్లేటపుడు 1బీ, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్, మొబైల్ నెంబర్, కౌలు రైతు అయితే సీసీఆర్సీ కార్డు , పంట ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు.

వాతావరణ ఆధారిత బీమా..: ఎకరాకు పత్తి రూ.2000, వేరుశనగ రూ.560, బత్తాయి రూ.2750, అరటి రూ.3025 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూలై 15వ లోపు చెల్లించాలన్నారు.

దిగుబడి ఆధారిత బీమా: ఎకరాకు వరి రూ.84, జొన్న రూ.38, కంది రూ.36, మినుము రూ.38, పసుపు రూ.180, ఉల్లి రూ.90 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. జూలై 31వ తేదీలోపు, వరికి మాత్రం ఆగస్టు 15లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు.

న్యాయసేవాధికార సంస్థ లక్ష్యాలను సాధించాలి

కడప రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి) : లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్) లక్ష్యాలను సాధించేలా విధులను బాధ్యతగా నిర్వర్తించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయ సేవాసదన్‌లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ విధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిటు, కేసుల వివరాలు, పరిష్కారం తదితర అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తదితరులు పాల్గొన్నారు.

దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తపడండి



పులివెందుల రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దోమ కాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తపడాలని నగరిగుట్ట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ స్నేహ ప్రత్యూష ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణంలోని నగరిగుట్టలో జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా ప్రజలకు దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్ బాష, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

పెండ్లిమర్రి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు.మండల పరిధిలోని మమ్ముసిద్దుపల్లెకొత్తపల్లె గ్రామాల పరిధిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి టీడీపీ నాయకులతో కలసి నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల వేళ చంద్రబాబు అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాల అమలు తీరును వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వైఫల్యాల వల్ల పథకాల జాప్యం జరుగుందన్నారు. ముందుగా గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యేకి ప్రజలు ఘనస్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, మండల శాఖల అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ కిశోర్ రెడ్డి, టీడీపీ నాయకులు విశ్వనాథరెడ్డి,సారథిరెడ్డి,రాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి,ప్రభాకర్‌రెడ్డి,చిన్నారెడ్డి, బాలుడు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి

అభివృద్ధి చూడలేక దుష్ప్రచారాలు : టీడీపీ

కమలాపురం రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూడలేక ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి జగన్ 2.0 అధికారంలోకి వచ్చాక టీడీపీ వారికి ఏ ఒక్క సంక్షేమం అందకుండా చూస్తామనడం చూస్తుంటే పాపం అధికారం పోయేసరికి ఏం మాట్లాడుతున్నామో తెలియని అయోమయంలో ఉన్నట్లున్నారన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు గంజాయి, భూకబ్జాలు, కల్తీ మద్యం, హత్యారాజకీయాలు, బూతులు ఇలా చెప్పలేనని దారుణాలు చూపారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ప్రజలకు చెప్పినట్లే ప్రతి హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు వాసుదేవరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ రాఘవరెడ్డి, గుజ్జుల నారాయణ, రామాంజనేయులురెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

సీకేదిన్నె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం మూలవంక సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆయిల్ మార్చేందుకు మంగళవారం విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్ తెలిపారు. వ్యవసాయ ఫీడర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు త్రీఫేజ్ కరెంటు నిలిపివేయడం జరుగుతుందన్నారు. అందుకు బదులుగా రాత్రి 8 గంటల నుంచి 12 గంటల వరకు సరఫరా అందించడం జరుగుతుందన్నారు. రైతులు గమనించి విద్యుత్తు శాఖకు సహకరించాలన్నారు. అదే విధంగా ఊటుకూరులో చెట్లు కొమ్మలు తొలగించాల్సి ఉండగా అందుకుగాను ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఉంటుందన్నారు. గృహ వినియోగదారులు విద్యుత్తు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

విక్రయించిన వాటికి బిల్లులు కచ్చితంగా ఇవ్వాలి

నాణ్యమైన ఎరువులు, మందులు విక్రయించాలి : ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే వాటి బిల్లులు రైతులకు కచ్చితంగా అందజేయాలని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) అంబవరం ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మినీ సచివాలయంలో పులివెందుల పరిధిలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణదారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, నాశిరకమైన ఎరువులు, మందులు విక్రయించవద్దన్నారు. నాణ్యమైన ఎరువులు, మందులు, విత్తనాలు అందించి రైతులకు తమవంతు అండగా నిలవాలన్నారు.అలాగే ఎప్పటికప్పుడు బిల్లు బుక్కులు, స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల నిల్వలు, అమ్మకాలు సరైన రీతిలో పొందుపరచాలన్నారు. దుకాణాల్లో లైసెన్స్ కనిపించేలా ఉండాలని, అనుమతులు ఉన్న మందులు మాత్రమే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలుచేయాలి

కడపసెవెన్ రోడ్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేసి 12వ పీఆర్సీ ప్రకటించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా కోరారు. ఏపీమున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న, సునీల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నగేష్, నగరకోశాధికారి వెంకటాద్రి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపు తెలుసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ రక్తగ్రూపును తెలుసుకోవాలని బాలాజీ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహబూబ్ పీర్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరం నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉచితంగా 200 మంది విద్యార్థులకు రక్తనమూనా పరీక్షలను ఎస్‌కె ల్యాబ్, శ్రీబాలాజీ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎలిజిబెత్ రాజమ్మ , ఉపాధ్యాయులుతదితరులు పాల్గొన్నారు.

'రవీంద్రనాథ్‌రెడ్డి, అంజాద్‌బాష కడపలో విద్వేషాలు పెంచుతున్నారు'

కడప కలెక్టరేట్, జూలై 7,(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రప్పారప్పా అంటే.. కడపలో జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి, అంజాద్ బాషా విద్వేషాలను రెచ్చగొడుతున్నారని పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి , మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ పనులు కూడా ప్రారంభం కావడం శుభపరిణామమన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి అభ్యర్థులు లేరన్నారు. వైఎస్సార్ ఆర్కిటెక్ యూనివర్సిటీ విద్యార్థులతో వైసీపీ చెలగాటం ఆడిందని మండిపడ్డారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి విమర్శలు, వ్యాఖ్యలు సరైనవి కావన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి

పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత అభినందనీయం

లింగాల,జూలై 7 (ఆంధ్రజ్యోతి): చదివినపాఠశాలకు తనవంతు సహాయం అందించాలని పాఠశాల పూర్వ విద్యార్థి లక్ష రూపాయలు వితరణ అందంచడం అభినందనీయమని లింగాల ఎంఈఓ రామకృష్ణయ్య పేర్కొన్నారు. లింగాల మండలం పెద్దకుడాల ఉన్నత పాఠశాలలో 1984-85 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థి అయిన రామన్నూతల పల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ కుమారుడు రాజగోపాల్‌రెడ్డి సోమవారం లక్ష రూపాయలను ఎంఈఓ రామకృష్ణయ్యకు అందించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డిని ఎంఈఓ, ఉపాధ్యాయులు సన్మానించారు.

పులివెందులలో మంత్రి సవిత

పులివెందుల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి సవిత పులివెందులకు వచ్చారు. 10గంటల ప్రాంతంలో అనంతపురం నుంచి రోడ్డుమార్గాన ఆర్అండ్‌బీ అతిథి గృహానికి వచ్చారు. అక్కడి నుంచి పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవితో కలిసి టీడీపీ కార్యాలయానికి వెళ్లారు. అలాగే వేంపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ మార్పు విషయమై మంత్రి సంబంధించిన అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల నాయకులు విశ్వనాథరెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, శేషారెడ్డి, శివమోహన్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి ఉన్నారు.



మంత్రితో చర్చిస్తున్న బీటెక్ రవి

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ ఎంటెక్ డేటా సైన్స్‌లో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు.నెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. త్రీమెన్ కమిటీ ద్వారా ఎంపికలు జరుగుతాయని చెప్పారు. ఒరిజినల్, జిరాక్స్ ఒక సెట్‌తో ఈనెల 9వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు ఉదయం 10.30గంటలకు హాజరుకావాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

లింగాల,జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆరోపణలు రావడంతో పులివెందుల డీఎల్‌డీఓ విజయలక్ష్మి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా లింగాల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై కార్యదర్శులతో ఆరా తీశారు.

'నల్లచట్టాలను రద్దుచేయాలి'

కడప ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకువచ్చిన నల్ల చట్టాలను రద్దుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ డి.కృష్ణారెడ్డి, జిల్లా ట్రెజరర్ కె.నరసింహరావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు శివశంకర్, బాబునాయక్, ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

రేపు పుష్పగిరి శ్రీచక్రానికి నవావరణ అర్చన

వల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుష్పగిరి శ్రీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకామాక్షి దేవి ఆలయ శ్రీచక్రానికి నవావరణ అర్చన 9వతేదీ సాయంత్రం 5గంటలకు జరుగుతుందని ప్రధాన ఆలయ అర్చకుడు రాజేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులందరూ తమ గోత్రనామాలను 6302085510 నెంబరుకు తెలపాలని ఆయన కోరారు.

పది నుంచి రక్తదాన వారోత్సవాలు

కమలాపురం రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16 వరకు ద్వితీయ వార్షిక రక్తదాన వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని తహసీల్దారు శివరాంరెడ్డి తెలిపారు. సోమవారం మదర్‌థెరిస్సా సేవా సమితి ట్రస్టు ఛైర్మన్ విజయకుమార్ తహసీల్దారు శివరామిరెడ్డి చేతుల మీదుగా రక్తదాన ద్వితీయ వార్షికోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదాన శిబిరం జూలై 11న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ కమలాపురంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : పీడీఎస్‌యూ

కడప ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్నడిమాండ్ చేశారు. సోమవారం వైవీయూ ప్రధాన ద్వారం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు మహేష్, శ్రీకాంత్, శాంత్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను పరిరక్షించుకుందాం

కడప నాగరాజుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం కార్మిక చట్టాలను పరరక్షించుకుందామని యూఈఈయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జూలై 9వ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక విద్యుత్ భవన్ ఆవరణంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిస్కం ప్రెసిడెంట్ శివశంకర్, యూనియన్ గౌరవాధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి సురేంద్ర, నాగమల్లయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయండి

కడప మారుతీనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఒంటిమిట్ట హరిత టూరిజం రెస్టారెంట్‌లో ఏపీ నూర్‌బాష్ (దూదేకుల) ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరి చిన్నరాజా పేర్కొన్నారు.జిల్లాలోని దూదేకుల వర్గీయులు తప్పక హాజరై ఆ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు సోమవారం స్థానిక బీకేఎం వీధిలోగల ఆ సంగం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలోఆ సంఘంరాష్ట్ర కార్యదర్శికె.పి.హుస్సేన్, జిల్లా గౌరవాధ్యక్షులు జి.బాబయ్య, జిల్లా అధక్షులు సుంకేసుల బాష, నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

వేంపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం అని టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, యువ నాయకుడు రవితేజారెడ్డి తెలిపారు. వేంపల్లెలోని ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి కార్యక్రమంలో పర్యటించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఇస్మాయిల్

కమలాపురం రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి):వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కమలాపురానికి చెందిన యువ నాయకుడు ఇస్మాయిల్ నియమితులయ్యారు. తనను ఆ పదవికి ఎంపిక చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ , వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, కమలాపురం ఇన్‌ఛార్జ్ నరేన్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు

తాగునీటి సమస్యకు పరిష్కారం

వేంపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతున్నట్లు సర్పంచుఆర్.శ్రీను తెలిపారు. పలు ప్రాంతాలకు తాగునీటి సమస్య ఉండడంతో పాపాఘ్ని నదిలో ఫిల్టర్‌ను మరింత లోతుకు వేసేందుకు సోమవారం పనులు ప్రారంభించారు. మరింత లోతుకు వేయించి తాగునీటి సరఫరా చేయిస్తామని సర్పంచు తెలిపారు.

ఇంకుడు గుంతలు నిర్మిద్దాం

జల సంపదను నిల్వ చేద్దాం

కమలాపురం రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట ఊరున ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టి దాని ద్వారా జల సంపదను నిల్వ చేయవచ్చు. ఇలా చేయడం ద్వారా రాబోవు తరానికి ఆదర్శంగా నిలవచ్చు. ఒక్క ఏడాది వర్షాకాలంలో మానవాళికి సరిపడా మూడు సంవత్సరాల అవసరాలకు సరిపడా నీటి సంపద వర్షం ద్వారా భూమికి చేరుతుంది. మన ఇంట్లో నీరు ఇంకడానికి గుంతలు ఏర్పాటు చేసుకుంటే ఈ వర్షం నీటిని అందులోకి మళ్లించవచ్చు. తద్వారా బోరు ఎండిపోకుండా ఉంటుంది. అవసరమైతే భవిష్యత్తులో బోరు నీటిని రివర్స్ ఆస్మోసిస్ పద్ధతి ద్వారా శుద్ధి చేసి తాగడానికి వాడుకోవచ్చు. అదే విధంగా రైతులు తమ పొలాల వద్ద ఐదు సెంట్లు స్థలంలో ఫారంపాండ్స్ ఏర్పాటు చేసుకోవాలి దాని ద్వారా వర్షాకాలంలో నీరు వృథా కాకుండా నిల్వ ఉంచుకోవచ్చు. మరీ ముఖ్యంగా వర్షాలు పడిన సమయంలో పంట ఎండిపోతుంటాయి. పొలాల వద్ద ఫారంపాండ్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల అందులో నుంచి నీటితో పంటలను కాపాడు కోవచ్చు.



ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం,ఓఅండ్‌సీగా ప్రశాంతి

కడప మారుతీనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడపజోన్ డిప్యూటీ సీటీఎం ఆపరేషన్స్ అండ్ కమర్షియల్ విభాగానికి నూతనంగా ఎం.ఎస్. ప్రశాంతి నియమితులయ్యారు. ఆ మేరకు సోమవారం ఆమె కడప రీజనల్‌మేనేజర్ కార్యాలయ సముదాయ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పుత్తూరు డిపో మేనజర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కడపకు బదిలీపై వచ్చినట్లు వెల్లడించారు.



మెగా పేరెంట్స్ మీటింగ్ తప్పనిసరిగా జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఎర్రగుంట్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ కమిటీ మీటింగ్‌ను ఈనెల 10వ తేదీన తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకటరమణ పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణపై మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిపి తప్పనిసరిగా వారు సమావేశానికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమం లో తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంఈవో శివప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోండి

బి.కోడూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మేకవారిపల్లె జిల్లా పరిషత్ హైస్కూలును సందర్శించిన ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞానవేదిక గత 38 సంవత్సరాలుగా ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని ఆకాంక్షిస్తూ శాస్త్రప్రచారంతో ప్రజలను చైతన్యవంతం చేస్తోందన్నారు. ఈ కార్యక్ర మంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు దేవదత్తం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందక్రిష్ణమాదిగ 60వ జన్మదిన వేడుకలు కూడా ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎర్రబల్లె ఓబయ్య మాట్లాడుతూ మాదిగ ఉద్యమం స్థాపించి నేటికి 31 సంవత్సరాలు పూర్తయిందని, ఎస్సీ వర్గీకరణ సాధించిన పద్మశ్రీ మంద క్రిష్ణమాదిగ 60వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కేక్ కోసి అందరికీ పంచిపెట్టి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో ఎస్.వెంకటసుబ్బయ్య, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్‌బాషా, జయచంద్ర, రంగనాయకులు, సుందర్‌రావు, దేవానందంబాబు, గురవయ్య, పిచ్చయ్య, బీసీ నేత గురుమూర్తి, ఆవాజ్ నేతలు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత చంద్రబాబుదే



అట్లూరులో సుపరిపాలనలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి



ప్రొద్దుటూరులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య తదితరులు

ప్రొద్దుటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలను అమలుచేసి నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుకే దక్కుతుందని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి లు తెలిపారు. సోమవారం స్థానిక 39 వవార్డులోని హనుమాన్ నగర్ జంగం పేట ప్రాంతాలలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంను టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపట్టాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ నవరత్నాలు పేరిట రాష్ట్ర ప్రజలను వంచించాడన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి అమ్మ ఒడి అని చెప్పి కేవలం ఒక్కరికే అందజేసి మోసం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం లో తల్లికి వందనం ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి డబ్బులు అందజేశామన్నారు. 4వేల ఫించనును ఒకే సారి పెంచారన్నారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి చెంగా సిద్దయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ సుబ్బారెడ్డి, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి కుతుబుద్దీన్ సర్పంచ్ శివచంద్రారెడ్డి మాడెం సుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కూటమితో ఇంటింటికీ సుపరిపాలన

అట్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడంతో ప్రభుత్వం ఇంటింటికీ సుపరిపాలన అందిస్తున్నదని డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం వలసపాలెం గ్రామంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పింఛన్లు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం అమలు చేసిన పథకాలతో మహిళలు ఎక్కువగా లబ్ధి పొందారన్నారు. అలాగే గ్రామస్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అట్లూరు మండల టీడీపీ నాయకులు పోతిరెడ్డి రెడ్డయ్య, మన్యం వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రామక్రిష్ణరెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

● ఆస్పత్రికి చేర్చిన డీఎస్పీ

జమ్మలమడుగు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో సోమవారం ఉదయం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో వ్యక్తి గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు అతన్ని చికిత్స నిమిత్తం తన వాహనంలో అసుపత్రికి తీసుకెళ్లారు. వివరాలిలా... సున్నపురాళ్లపల్లె నుంచి బాబయ్యతో పాటు లక్ష్మణన్న అనే ఇరువరు ద్విచక్రవాహనంలో జమ్మలమడుగుకు వస్తుండగా అదుపుతప్పి కింద పడటంతో బాబయ్య అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అదే సమయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బందోబస్తు నిమిత్తం వెళుతున్న డీఎస్పీ గమనించి తన వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ప్రొద్దుటూరు , జూలై 7 (ఆంధ్రజ్యోతి) : తాగుబోతు భర్తతో ఏగలేక మద్యం మానమని ఎంత చెప్పిన వినకపోవడంతో జీవరత్నమ్మ(72) అనే వృద్ధురాలు బాతు రూములు శుభ్రం చేసే క్లినిక్ యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డినగర్‌కు చెందిన జీవరత్నమ్మ, పుల్లయ్య దంపతులు మేకలు మేపుకుంటూ జీవనం సాగించేవారు. .జీవరత్నమ్మ భర్త పుల్లయ్య ప్రతిరోజు మద్యం తాగుతూ గొడవ పడుతుండటంతో ఆమె అతన్ని మద్యం మానమని చెప్పినా వినకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఆదివారం రాత్రి బాత్ రూం క్లీన్ చేసే యాసిడ్ తాగింది. దీంతో ఆమెను వారి కుమారులు కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం మరణించినట్లు ఒన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవరెడ్డి కేసు నమోదు చేశారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు,జూలై 7 (ఆంధ్రజ్యోతి) అప్పులోల్ల ఒత్తిళ్లు తాళలేక మూడింటి నాగార్జున(35) అనే వ్యక్తి ఇంటి పైకప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక పెద్ద శెట్టిపల్లెలో జరిగింది. వివరాల్లోకి వెళితే మూడింట నాగార్జున ఇటీవల సొంత ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. కానీ అప్పుల వాళ్ళ ఒత్తిళ్లు పెరగడంతో సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి పైకప్పుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య గురులక్ష్మీ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఆత్మహత్య సంఘటనపై రూరల్ ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రొద్దుటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం దువ్వూరుకు వెళ్లే రహదారిలో కానిస్టేబుల్ ఓబులేసును కారు ఢీ కొనడంతో గాయాలయ్యాయి. కానిస్టేబుల్ ఓబులేసు ప్రొద్దుటూరు వాసి. దువ్వూరు పోలీసు స్టేషన్లో పనిచేస్తున్నాడు. డ్యూటీ ముగించుకోని ప్రొద్దుటూరులోని తన ఇంటికి కారులో బయలు దేరాడు. అయితే రోడ్డులో కారు ఆగిపోవడంతో బయటకు వచ్చి రోడ్డు సైడు నిలబడి ఉండగా వేరే కారు వచ్చి అతన్ని ఢీ కొట్టడంతో గాయాలయ్యాయి. అతన్ని ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి

చాపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని ఐసీడీఎస్ చాపాడు ప్రాజెక్టు సీడీపీవో ముంతాజ్‌బేగం, ఎంఈవో రవిశంకర్ అన్నారు. బి.మఠం మండలంలో ఐసీడీఎస్ శాఖలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేస్తున్న శారదాదేవి ఇటీవల పదవీ విరమణ చేయడంతో సోమవారం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చాపాడు, దువ్వూరు, బి.మఠం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలి

పోరుమామిళ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగే అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ అన్నారు. సోమవారం పోరుమామిళ్లలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు విద్యుత్ కార్మికులు, శానిటేషన్ వర్కర్లు, ఆటో, తోపుడుబండ్లు, హమాలీ, ఉపాధి హామీ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

చెత్తకుప్పలో హెల్త్ క్లినిక్ మందులు

● విచారణ చేపట్టిన వైద్యాధికారి



నిప్పులో కాలిన ప్రభుత్వం సరఫరా చేసిన మందులు

ప్రొద్దుటూరు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఉన్న చెత్తకుప్పలో ప్రభుత్వం సరఫరా చేసే మందులు, సిరప్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామీణ ప్రజలకు అందాల్సిన ఔషదాలు చెత్తలో కలిసి నిప్పంటుకున్నాయి. విషయం తెలుసుకున్న కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమన్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. వీటికి ఇంకా ఈ ఏడాది అక్టోబరు, సెప్టెంబరు వరకు ఎక్స్‌పెయిరీ డేట్ ఉంది. అయినప్పటికి ఇలా చెత్తకుప్పలో తగలబడుతూ దర్శనమివ్వడం చర్చనీయాంశమైంది. ఈ విషయం తెలిసిన కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిప్పులో మందులు కొన్ని పూర్తిగా కాలిపోగా మరికొన్ని పాక్షికంగా కాలాయి. ఘటనపైన ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు డాక్టర్ సుమన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

గండికోట ముంపు పరిహారాన్ని నిలుపుదల చేయాలి

●జేసీకి ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి , రైతుల వినతి



జేసికి ఫిర్యాదు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి, రైతులు

కడప కలెక్టరేట్, జూలై7 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం గండికోట ముంపు బాధితులకు విడుదల చేసిన రూ.5 కోట్ల పరిహారాన్ని వెంటనే నిలుపుదల చేసి నిజమైన రైతులను విచారణ ద్వారా గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి, ఆర్ ఎస్ కొండాపురం మండల ముంపు రైతులు వినతి పత్రం అందజేశారు. సోమవారం కలెక్టరేట్ లోని జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ సమీక్ష అనంతరం జేసీకి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి, రైతులు జేసీతో మాట్లాడుతూ గండికోట ముంపు కింద భూములు కోల్పో యిన రైతులకు గత వైసీపీ ప్రభుత్వం రూ.7 కోట్లు రెఫర్ చేయడం జరి గిందన్నారు. అయితే 2019 వరకు బొమ్మెపల్లి, దరువుపల్లెలో భూములు న్నట్లు ఎంపీ అవినాష్‌రెడ్డి అనుయాయులు పెద్దఎత్తున తప్పుడు రికార్డు లు సృష్టించారన్నారు. ఈ రెండు గ్రామాల్లో అంతా బీసీలే ఉన్న ప్పటికి 2014 గజిట్ నోటిఫికేషన్‌లో పులివెందుల, లింగాల, వేముల మండలాలకు చెందిన అగ్రకులాల పేరుతో 133 ఎకరాలు అడ్డగోలుగా రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకున్నట్లు చూపారన్నారు.. ఒక మండలంలో నివసించే వారికే భూములు ఇవ్వడం కష్టంగా ఉంటే పక్క మండలాలకు చెందిన 33 మంది పేరు మీద 2004లో భూములు కేటాయించినట్లు రికార్డులను చూపి సొమ్ము చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి భూ మాఫియాకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలనీ, అక్రమంగా సొమ్ము చేసుకోవాలన్నా రూ.5 కోట్లు నిధులను నిలుపుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేయాలి

జమ్మలమడుగు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలుపరచాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగు నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తల సమావేశం సాయిశివానీ కల్యాణ మండపంలో నిర్వహించారు. నాయకులు కొమెర్ల గురివిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, దన్నవాడ మహేశ్వరరెడ్డి, లక్షుమయ్య పాల్గొన్నారు.

అనుమతుల్లేని వాటర్‌ప్లాంట్లపై చర్యలు చేపట్టాలి

బద్వేలు, జూలై7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు పాటించని వాటర్‌ప్లాంట్లపై చర్యలు చేపట్టాలని కోరుతూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, ఆదిల్‌లు మాట్లాడుతూ పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లకు అనుమతులేవన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరి పీటర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవడంతో డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్లు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏఐఎస్‌ఎఫ్ పట్టణ కార్యదర్శి నాని, పాల్గొన్నారు.

10 గంటల పని విధానం రద్దు చేయండి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో చేసిన తీర్మాణాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవడానికి ప్రభుత్వం పది గంటల పని విధానంపై క్యాబినెట్‌లో తీర్మాణం చేయడం దారుణమని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి కార్మికులను అణచివేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, డీవైఎఫ్‌ఐ కార్యదర్శి విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరు పట్టణంలోని అనుకుంట వంక పూడికతో నిండిపోయి వర్షం కురిసినపుడు ఉప్పొంగి నీరంతా కడప ప్రధాన రోడ్డుపైకి వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నంద్యాల రోడ్డులోని కేసీ కెనాల్ నీటితో పాటు ఎర్రచెరువు, పంట పొలాల నీరు, వర్షపునీరు వంకలో ప్రవహిస్తాయి. బద్వేలు రోడ్డులో ఈ కాలువ 20అడుగుల లోతు ఉండగా కడప రోడ్డుకు వెళ్లే సరికి పూడికతోనిండి నాలుగు అడుగులకే పరిమితమైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ వర్షాలు రాకముందే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -మైదుకూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

మావూరి రహదారిని బాగు చేయండి సారూ..!

● ఆర్‌అండ్‌బీ మంత్రికి చిన్నవెంతుర్ల గ్రామస్థుల వినతి



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న చిన్నవెంతుర్ల గ్రామస్థులు

మైలవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నవెంతుర్ల నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెద్దవెంతుర్ల గ్రామాల మధ్య ఉన్న తారురోడ్డు మరమ్మతులు చేయించాలని చిన్నవెంతుర్ల గ్రామస్థులు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. సోమవారం జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలిసి వారు రహదారి సమస్యను వివరించి వినతిపత్రం అందించారు. మూడు కిలోమీటర్లు ఉన్న ఈ రహదారిలో వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డు కొత్తరోడ్డు వేయకుండా కనీసం మరమ్మతులు చేయించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా రహదారులకు మరమ్మతులు చేశారని గ్రామ పరిదిలోని రహదారిని పట్టించుకోలేదని మంత్రికి తెలుపగా ప్రజల సమస్యలు ఆలకించిన మంత్రి గ్రామస్థుల ముందే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వీలైనంత త్వరగా రహదారికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. మంత్రికి వినతి పత్రం అందించినవారిలో మాజీ సర్పంచు శివరామిరెడ్డి, డీలరు బాస్కర్, బండల చిన్నమహమ్మద్, బెస్తవేముల పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు పెంచే వరకు ఉద్యమం ఆగదు

ప్రొద్దుటూరు , జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలలో పనిచేసే ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్, మెయిన్ ఆఫీసు సెక్షన్‌లలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేసే నాన్‌పీహెచ్ వర్కర్‌కు రూ.26 వేలు పెంచాలని లేకుంటే ఉద్యమం ఆగదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి హెచ్చరంచారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ గత 18 రోజులకు పైబడి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఉద్యమం చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఎన్నికల ముందు కార్మికుల జీతాల పెంపు చేపడతామని హామీ ఇచ్చి ఇప్పటికి అమలు చేయలేదన్నారు. 9 తేదీ జరిగే క్యాబినెట్ సమావేశంలో జీతాల పెంపు నిర్ణమం ప్రకటించాలని లేకుంటే సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఓబులమ్మ, కోశాధికారి బీటెక్ శివ, సునంద, బాబు, శ్రీను, జాఘువా, చంటి, మోహన్‌లు పాల్గొన్నారు

భూముల కేటాయింపులపై విచారణ జరపండి

బ్రహ్మంగారిమఠం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలో ఎన్‌హెచ్-67, గ్రీన్‌ఫీల్డ్ హైవే జాతీయ రహదారుల కోసం రెవెన్యూ పరిధిలోని భూముల కేటాయింపుల్లో జరిగిన అవకతకలపై విచారణ చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి పెదుళ్లపల్లె ప్రభాకర్ డిమాండ్ చేశారు. బి.మఠంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ బి.మఠం మండలంలోని ఇటు రేకలకుంట నుంచి నందిపల్లె వరకు అటు మల్లేపల్లె గ్రామ రెవెన్యూ పొలాల్లో పదుల సంఖ్యలో భూములకు దొంగ రికార్డులు పుట్టించి కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి చేజర్ల రవి, నాయకులు నరసయ్య, సత్యంలు పాల్గొన్నారు.

అదనపు చార్జీలను ప్రభుత్వమే భరించాలి

ప్రొద్దుటూరు ,జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కరెంటుబిల్లులలో అదనపు చార్జీలను ప్రభుత్వమే భరించాలని స్వర్ణభారత్ ప్రజాపార్టీ వ్యవస్థాపకుడు శిలివేరు దశరథరామయ్య కోరారు. సోమవారం డిప్యూటీ తహసీల్దారు అజయ్ బాబుకు కరెంటు బిల్లుల్లో అదనపు చార్జీలను ప్రభుత్వమే బరించాలని కోరుతూ వినతి పత్రం అంజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులోనే 2024 జూన్ నుంచి 2025 మార్చి వరకు 11 నెలల కాలంలోనే రూ 13.19 కోట్లను అదనపు చార్జీల పేరుతో వసూ ళ్లు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు కాలే దేవానంద్, ప్రధాన కార్యదర్శి లోకేశ్వరి, మహిళా అధ్యక్షురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లులేని నిరుపేదలకు వెంటనే స్థలాలివ్వండి

ప్రొద్దుటూరు ,జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సొంత స్థలం ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు, న్యాయవాది పుత్తా లక్ష్మీరెడ్డి డిమాండ్ చేశారు. ఆమేరకు సోమవారం డిప్యూటి తహసీల్దారు అజయ్‌బాబుకు ఇంటి స్థలాల కోసం ప్రజాపక్షం పార్టీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పుత్తా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ అమృతనగర్ ఫేజ్ 2 లో 898 ప్లాట్లు ఖాళీగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ఆర్‌టీఐ ద్వారా అడిగిన దరఖాస్తుకు సమాధానమిచ్చారన్నారు. ఆ స్థలాలు ఇళ్లలేని పేదలకు అందజేయాలని వంద దరఖాస్తులు పెడితే ఇంతవరకు సమాధానం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి విమునిసుబ్బారెడ్డి, జి ప్రతాప్, ఎస్‌ఎండీ వలి, రామ్మోహన్ రెడ్డి, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సలహాలతో అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చు

ఖాజీపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు వైద్యుల సలహాలు పాటించగలిగితే ఖర్చు తగ్గించి అధిక పాల ఉత్పత్తి పెంచవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి శారదమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి మాట్లాడుతూ పాడి రైతులు సూపర్ నేటియర్, ఏపీబీఎల్, కోవన్, కోవన్-2 రకాలను సాగు చేసుకోవాలన్నారు. , అలాగే దూడలకు కూడా నట్టల నివారణ మందు తాపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకుడు శ్రీనివాసులరెడ్డి, సహాయ సంచాలకుడు మురళీ, పశువైద్యాధికారి బాబురామచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలే లక్ష్యంగా సీపీఐ మహాసభలు

బద్వేలు, జూలై7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలే లక్ష్యంగా సీపీఐ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కారాల్యయంలో మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24 వరకు బద్వేలులో జిల్లా మహాసభలు, అలాగే ఆగస్టు 20 నుంచి 25 వరకు రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నామని, తెలిపారు. పార్టీ నేతలు వీరశేఖర్, బాలు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి

కలసపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారెడ్డి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు పార్టీ క్రియాశీలక కార్యకర్త ముత్తుముల నారాయణరెడ్డి (55) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. గత మూడు రోజుల క్రతం అస్వస్థతకు గురైన మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.